క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి



రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు

గుంతకల్లుటౌన్: ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర కింద రూ.15 వేలు చెల్లిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ అనుబంధమైన భగత్‌సింగ్ ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. జీఓ 21ను రద్దు చేయాలని, ఆటోవాలాలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలకు ప్రభుత్వమే ఇన్సురెన్స్ సొమ్ము చెల్లించాలని, ఆటో, ట్యాక్సీలపై ఫైనాన్స్ కంపెనీలు, రవాణాశాఖ అధికారుల వేధింపులు ఆపాలని నాగరాజు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, నాయకులు ఎస్‌కెఎం.బాష,హరి, వెంకటేష్, రాజేష్, వేణు, గురుస్వామి, బండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట వైవిధ్యంతో భూమికి జీవం



పంట దిగుబడులను చూపుతున్న ఏఓ, రైతులు

యల్లనూరు: పంట వైవిధ్యంతో భూమికి జీవం పోయవచ్చని వ్యవసాయాధికారి రామకృష్ణుడు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మంపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు ఎరికలరెడ్డి రెండెకరాల్లో ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ (పీఎండీఎస్) విధానంలో విత్తనశుద్ధి చేసి ఘన జీవామృతంతోపాటు సజ్జ, ఆముదం, కంది, గొరుచిక్కుడు, అనుములు సాగు చేశాడు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పీఎండీఎస్ విధానం వల్ల అన్ని రకాల పోషకాలు పంటలకు అందుబాటులో ఉంటాయన్నారు. కలుపు తగ్గుతుందన్నారు. భూమిలో తేమ శాతం నిలువ శక్తి పెరుగుతుందన్నారు. భూమి కోతకు గురి కాదన్నారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి బాబయ్య, మెంబర్ దేవేంద్రనాయుడు, డిజిటల్ వెంకటేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి తిరుపాల్, ఐసీఆర్‌పీలు కళావతి, సాయికుమారి, రాణి, రైతులు పాల్గొన్నారు.

వైద్యుడి సేవలు అభినందనీయం



డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తూ నేషనల్ హెల్త్ అథారిటీ ద్వారా సత్కారం పొందిన పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం సాయంత్రం సుమంత్ ఆర్థోపెడిక్ ఆస్పత్రికి వెళ్లి శ్రీకాంత్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించారు. రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏబీడీఎం అమలులో దేశంలోనే టాప్–50 లోనూ, రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి నీలకంఠరెడ్డి, కమిటీ నాయకులు నాగభూషణంరెడ్డి, కిరణ్ రెడ్డి, అనంతసేనారెడ్డి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



అశ్వత్థంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు (పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులు, హుండీల్లోని కానుకలను మంగళవారం దేవదాయ శాఖ జిల్లా అధికారి ఆదిశేషునాయుడు, ఈఓ సుబ్రమణ్యం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా రూ.2,06,996 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరులో రాజగోపాల్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం ఆలూరు గ్రామానికి చెందిన రాముకు చెందిన టీ బండి స్థలం తనదని, అందులో నుంచి ఖాళీ చేయాలంటూ బెదించడమే కాకుండా చంపుతానని హెచ్చరించాడన్నారు. రాము ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదకరం!

- పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలు
- జరిమానాలతో సరిపెడుతున్న అధికారులు





తాడిపత్రిలో ప్రమాదకరంగా వెళ్తున్న ఆటో

తాడిపత్రిటౌన్: ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. తాడిపత్రిలో పరిమితికి మించి, డ్రైవర్ పక్కనే ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ప్రయాణికులు ప్రమాదాలు కోరి తెచ్చుకుంటున్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో ప్రమాదకర ఆటో ప్రయాణాలపై పలు సందర్భాలలో హెచ్చరికలు చేసినా ఆటోవాలాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అలాగే అధికారులు కూడా ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి ఆ తర్వాత షరా మామూలే అన్నరీతిలో వదిలేస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి, పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన పలు గ్రామాలు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ఆటోలు ప్రయాణికులతో తాడిపత్రికి వస్తుంటాయి. ముఖ్యంగా ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో గ్రామీణులకు ఆటో ప్రయాణాలే శరణ్యం అవుతున్నాయి. ఇదే అదునుగా ఆటో డ్రైవర్‌లు పరిమితికి మించి ఒక్కో ఆటో 15 నుంచి 20 మందితో ప్రయాణిస్తున్నాయి. అలాగే పక్కన అటు ఇద్దరు, ఇటు ఇద్దరు ప్రయాణికులను కూర్చోపెట్టుకుని ప్రమాదకర రీతిలో డ్రైవర్లు ఫీట్లు చేస్తున్నారు. ప్రమాదం జరిగితే పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడటంతోపాటు తీవ్రంగా గాయాల పాలవుతున్నారు. ఇదిలా వుంటే పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లలను ఆటో డ్రైవర్లు ప్రమాదకరంగా చిన్న ఆటోలో దాదాపు 20 మందికి పైగా ఎక్కించుకుని వాయువేగంతో నడుపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పిల్లల భవిష్యత్ అంధకారం కానుంది. ఇంతా జరుగుతున్నా పోలీసులు, ఆర్‌టీఓ అధికారులు మాత్రం చలానాలు రాసి వదిలేయడం పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలు నివారించవచ్చని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవు. గత రెండు నెలలుగా తరచూ దాడులు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఆరుగురు ఆటో డ్రైవర్లకు దాదాపు రూ.60 వేలు జరిమానా విధించాం. పరిమితికి లోబడి ప్రయాణికులతో మాత్రమే ఆటోలు నడవాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాసులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, తాడిపత్రి

కేసులు నమోదు చేస్తాం



గ్రామాల నుంచి పట్టణంలోకి వచ్చే ఆటో డ్రైవర్‌లకు ఇప్పటికే పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చాం. డ్రైవర్ పక్కన వున్న అదనపు సీట్లును తొలగించాం. నిబంధనలు పాటించని పలువురు ఆటో డ్రైవర్లకు జరిమానాలు విధించాం. అలాగే కొనసాగితే ఆటోలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. –గౌస్‌బాషా, ఎస్‌ఐ, తాడిపత్రి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

యల్లనూరు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ప్రధానోపాధ్యాయులకు పుట్లూరు సీఐ సత్యబాబు సూచించారు. మంగళవారం ఎమ్మార్సీలో ఏంఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి సీఐ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. తప్పు చేస్తే తీవ్ర దండన ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే జైలుకు పంపుతాం

యల్లనూరు: సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవాలని, గొడవలకు పాల్పడినా, ప్రోత్సహించినా జైలుకు పంపుతామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. మంగళవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. మట్కా, పేకాటపై నిఘా పెట్టామన్నారు.

పాదయాత్ర జయప్రదం చేయండి



గార్లదిన్నెలో పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె: పంటల గిట్టుబాటు ధరల కోసం ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ నుంచి పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలిపారు.మంగళవారం గార్లదిన్నెలో రైతు సంఘం నాయకులు రైతుల పాదయాత్రకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిర్చి డబ్బిరకం, కడ్డీ రకానికి క్వింటాల్ రూ.50 వేలు, మిరప రూ.25 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. 2024–25 ఖరీఫ్, రబీలో నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ప్రకటించాలన్నారు.అలాగే పప్పు శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాల్ రూ.10వేలతో కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 10న కలెక్టరేట్ వద్ద రైతుల సమస్యలపై ధర్నా నిర్వహిస్తామన్నారు. రైతులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చెన్నారెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి నిర్వాకంపై విచారణ

తాడిపత్రి రూరల్: సచివాలయ ఉద్యోగి సుధాకర్‌పై మంగళవారం మునిసిపల్ ఉద్యోగులు విచారణ చేపట్టారు. పట్టణంలోని నందలపాడు సచివాలయం–1లో ఉద్యోగి సుధాకర్ పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడటంతో ఆగ్రహించిన కమిషనర్ శివరామక్రిష్ణ విచారణకు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు నలుగురు మునిసిపల్ ఉద్యోగులు సచివాలయానికి వెళ్లి విచారణ నిర్వహించారు. విచారణలో వేలిముద్రలు తీసుకుని డబ్బు ఇవ్వని పింఛన్‌దారుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పింఛన్ల పంపిణీ తరువాత మిగిలిన డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయకపోవడంపై కూడా ఆరా తీశారు. విచారణ అనంతరం కమిషనర్‌తో ఉద్యోగులు సమావేశమయ్యారు. విచారణలో తాము సేకరించిన వివరాలను కమిషనర్ అందజేశారు.

‘సంక్రాంతికి వస్తున్నాం’ 50 రోజుల వేడుక



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా 50 రోజుల వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవీ థియేటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో థియేటర్ యాజమాన్యం గోవిందు, మంజు, మేనేజర్ సంజీవ్, విక్టరీ వెంకటేష్ పట్టణ అధ్యక్షుడు బుజ్జి, అభిమానులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు



అలంకరణలో చౌడేశ్వరీదేవి

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లిలో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

తల్లిదండ్రుల ఆచూకీ కోసం బాలిక తపన

పామిడి: తన కుటుంబసభ్యుల ఆచూకీ తెలపాలంటూ మంగళవారం పామిడి పోలీసులను 13 ఏళ్ల బాలిక మహాలక్ష్మి ఆశ్రయించింది. వివరాలను సీఐ యుగంధర్ వెల్లడించారు. తమది గుత్తి ప్రాంతమని, తండ్రి మారెప్ప, తల్లి లక్ష్మీనరసమ్మ, అన్న విజయ్ ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం తన కుటుంబసభ్యులు తిరుపతిలో ఉన్నారని, వారి వద్దకు తనను చేర్చాలని వేడుకుంది. ఇంతకు మించి మరే ఇతర వివరాలు తెలియడం లేదని పోలీసులు పేర్కొన్నారు. బాలిక కుటుంబసభ్యుల గురించి తెలిసిన వారు 94407 96827, 94400 11294, 94948 36844కు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన బాలముని, చౌడయ్య

శింగనమల: మండలంలోని శింగనమల క్రాస్‌లో ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన బాలముని, చౌడయ్య ఉదయం ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని రాత్రి తిరిగి 544–డీ రోడ్డు మీదుగా పోతురాజుకాల్వకు బయలుదేరారు. శింగనమల క్రాస్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు మీద వెళుతున్న వారు గుర్తించి, వెంటనే వారిని 108లో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో మంగళవారం ఇద్దరు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.640ను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్న సుధాకర్, పోచంరెడ్డిని అరెస్టు చేశామన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలంలోని పెద్దఎక్కలూరు వద్ద ఉన్న పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు శాండ్ టీమ్ పోలీసులు శ్రీనివాసులు, జగన్ తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్న పెద్దిరాజుకు మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ సభ్యులు రూ.12వేలు ఆర్థికసాయం అందించారు. రెండు సంవత్సరాలుగా ఆయన వ్యాధితో బాధపడుతూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించేందుకు ఇబ్బంది పడుతున్నాడన్న విషయం తెలుసుకున్న వారు అన్వరానంద స్వాముల 22వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని నగదు అందజేశారు. ఆర్థికసాయం కార్యక్రమంలో కన్వీనర్ శంకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపై పడిన గుంత

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలోకి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంత ఏర్పడి ఆరునెలలైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామ ముఖ ద్వారం ముందు రోడ్డుపై గుంత పడింది. సంబంధిత అధికారులెవ్వరూ ఆ గుంతకు మరమ్మతులు చేపట్టాలన్న ఆలోచనే రాకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామంలోకి వెళ్లేందుకు ప్రధాన రోడ్డు అవ్వడంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గుంత వద్ద ఏ మాత్రం ఏమార్చినా ప్రమాదం నెలకొనే ఆస్కారం లేకపోలేదు. ఇక కొత్త వ్యక్తులైన వాహనచోదకులు, పాదచారులకు ఈ గుంత ప్రమాద ఘంటికగా మారింది. రాత్రివేళ ఈ రోడ్డుపై ప్రయాణించేవారిని ఆ దేవుడే... కాపాడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం తాత్కాలికంగా గ్రామస్తులు ఈ రోడ్డు గుంత వద్ద రాళ్లు, కట్టెలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనచోదకుల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి చర్చీల్లో ‘ఉపవాస దిన’ ప్రార్థనలు

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఉపవాస దిన ప్రార్థనలు బుధవారం ప్రారంభం కానున్నట్లు సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించే భస్మ బుధ ఆరాధనతో క్రైస్తవుల ఉపవాస దినాలు ప్రారంభమవుతాయన్నారు. అందులో భాగంగా ప్రతి శుక్రవారం స్థానిక చర్చిలో సాయంకాలపు శ్రమల ధ్యాన ఆరాధన ప్రార్థనలు ఉంటాయన్నారు. క్రీస్తు పునరుత్థాన దినం వరకూ 40 రోజులు పాటు క్రైస్తవులు భక్తి ప్రపత్తులతో ఈ ఉపవాస దినాలు ఆచరిస్తారన్నారు. ఆరాధన కార్యక్రమాల్లో క్రైస్తవ విశ్వాసులు పెద్దెత్తున పాల్గొని దేవుని అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ ‘గాదె’ గెలుపుపై పీఆర్‌టీయూ నేతల హర్షం

పామిడి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు గెలుపుపై మంగళవారం రాత్రి పీఆర్‌టీయూ పామిడి మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎల్లప్ప, మండల అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ ఉపాధ్యాయ సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చాంద్‌బాషా, సూర్యప్రకాష్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: వాహన దారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరులో సిబ్బందితో కలసి ఎస్ఐ వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి, రికార్డులు సక్రమంగా లేనివారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు బయటకు వచ్చినప్పుడు రికార్డులు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇకనుంచి కొత్త వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామన్నారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష లేకుండా అర్హులైన విద్యార్థులకు ప్రవేశం ఉండేదన్నారు. కానీ ఈ ఏడాది నుంచి ముస్లిం,మైనార్టీ విద్యార్థులకు కూడా ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థుల ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాజీకి అవకాశమున్న కేసులను పరిష్కరించండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి

గుత్తి: రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి సూచించారు. గుత్తిలోని ఏడీజే కోర్టు హాల్లో మంగళవారం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యంగా పోలీసు అధికారులు స్పందించి రాజీకి అవకాశమున్న కేసులను పరిష్కారం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శ్వేత, సీఐ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న జిల్లా జైల్లో వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైల్లో మార్చి 7న 25 వేల కిలోల వేరు శెనగ చెక్కకు వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప రేంజ్ ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామరు. వేలంలో పాల్గొనేవారు రూ.20,000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

దొంగ అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని యుగుడూరులోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగను మంగళవారం రాత్రి అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజుల క్రితం యాడికి మండల కేంద్రానికి చెందిన జోగిరాజ యుగుడూరు గ్రామంలోని ఒక ఇంట్లోకి ప్రవేశించి హుండీలో ఉన్న రూ.75 వేల నగదును అపహరించాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. మండలంలోని చుక్కలూరు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజను అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో చేసిన దొంగతనం ఒప్పుకున్నాడన్నారు. నిండితుడి నుంచి రూ.58,070ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

కమిషనర్ విస్తృత పర్యటన



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యపై ఆరా తీశారు. ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని ప్రజలకు ఆయన సూచించారు.